సాక్షి
జగిత్యాల
గురువారం । 2 । ఫిబ్రవరి । 2023



కొండపై సీపీ పూజలు

కొండగట్టు : కరీంనగర్ పోలీసు కమిషనర్ సుబ్బారాయుడు బుధవారం కొండగట్టు శ్రీఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.



'రోళ్లవాగు'కు లీకేజీలు

సారంగాపూర్ : రోళ్లవాగు ప్రాజెక్టు మూడో కట్ట వద్ద నీరు లీకవుతోంది. అధికారులు మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 31.0/16.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటిపూట ఉక్కపోతగా ఉండి, సాయంత్ర చలితీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

సజావుగానే ఉపాధ్యాయ బదిలీలు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాలజోన్: ఉపాధ్యాయుల బదిలీలు సజావుగా జరుగుతాయని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. జెడ్పీ కార్యాలయంలో బుధవారం ఉపాధ్యాయ సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉద్యోగుల పక్షపాతిగా నిలిచిన ముఖ్యమంత్రి ఉపాధ్యాయుల బదిలీలను సజావుగా జరపాలని అధికారులకు ఆదేశాలిచ్చారని తెలిపారు. అర్హతలు, నిబంధనల ప్రకారమే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను ప్రభుత్వం నిర్వహిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో రామానుజచారి, డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.

విపత్తులను ఎదుర్కోవాలి



మాట్లాడుతున్నఇన్‌స్పెక్టర్ మన్మోహన్

జగిత్యాలటౌన్: విపత్తులను ఎదుర్కొనేందుకు యువత సిద్ధంగా ఉండాలని ఎన్డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ మన్మోహన్ సూచించారు. మానవ తప్పిదాలతోపాటు ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎన్డీఆర్‌ఎఫ్ దళం స్థానిక స్వామివివేకానంద మినీస్టేడియంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించింది. జాతీయ విపత్తు ప్రతి స్పందన దళం(ఎన్డీఆర్‌ఎఫ్) కమాండెంట్ జహీర్‌ఖాన్, కలెక్టర్ రవి ఆదేశాలతో మన్మోహన్ ఈ కార్యక్రమం చేపట్టారు. విపత్తులను ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై వివరించారు. ఎన్డీఆర్‌ఎఫ్ సభ్యులు అంకయ్య, రాజేశం, వెంకటేశ్వర్లు, రవి, జిల్లా యువజన, క్రీడల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశ్రామిక అభివృద్ధి సాధించాలి



రైస్‌మిల్లు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: జిల్లా వ్యవసాయ, పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. బుధవారం లక్ష్మీపూర్ గ్రామంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వర రైస్‌మిల్లు ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా వ్యవసాయ రంగంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉందని తెలిపారు. పారిశ్రామికంగా కూడా అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెరుకు జాన్, ఉపసర్పంచ్ పన్నాల రఘు, రైస్‌మిల్లు నిర్వాహకులు ఎలేటి రమణారెడ్డి, తీపిరెడ్డిశేఖర్, ఎడ్మల రఘుపతిరెడ్డి తదితరులుపాల్గొన్నారు.

కరాటే పోటీల్లో సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న అతిథులు

మెట్‌పల్లి(కోరుట్ల): హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన ఆసియా మార్షల్ అర్ట్స్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు పతకాలు సాధించారు. వీరిని బుధవారం పట్టణంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి తదితరులు అభినందించారు. ఆత్మరక్షణతోపాటు శారీరక ఆరోగ్యం కోసం పిల్లలకు కరాటేలో శిక్షణను ఇప్పించాలని సూచించారు. కార్యక్రమంలో మాస్టర్లు సురేశ్, కార్తీక్, రాజ్‌కుమార్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

సహకార ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా సహకార శాఖ ఉద్యోగుల సంఘం ఎన్నికలు బుధవారం జిల్లా కేంద్రంలో జరిగాయి. అధ్యక్షుడిగా ఎండీ అసద్, కార్యదర్శిగా ఎండీ నిజామొద్దీన్, ఉపాధ్యక్షులుగా ఎం.స్వప్న, ఎంఏ ఖలీం, కోశాధికారిగా అశోక్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా వెంకటసాయిరెడ్డి, అభిషేక్ ఎన్నికయ్యారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నాయకులు బోగ శశిధర్, ఎం.నాగేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. నూతన కార్యవర్గం జిల్లా సహకార అధికారి రామానుజాచారిని కలిసి డైరీ విడుదల చేసింది.

ఉమ్మడి జిల్లాకు నిరాశే



బసంత్‌నగర్ విమానాశ్రయంపై బడ్జెట్‌లో రాని స్పష్టత

- కరీంనగర్ ట్రిపుల్ ఐటీపైనా దొరకని హామీ
- ఆస్తిపన్ను విధింపుపై మిశ్రమ స్పందన
- ఈసారి కూడా నెరవేరని కేంద్రీయ, నవోదయ స్కూళ్లు
- నర్సింగ్ కాలేజీ కేటాయింపుల్లోనూ దక్కని అవకాశం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

కేంద్ర బడ్జెట్ 2023-24 ఉమ్మడి జిల్లా ప్రజల ఆశలపై నీళ్లు చల్లింది. ఎలాంటి కేటాయింపులూ జరగలేదు. ముఖ్యంగా ఎయిర్‌పోర్టులు, జాతీయ రహదారుల లో ఉమ్మడి జిల్లాకు కేటాయింపులు దాదాపుగా లేవనే చెప్పాలి. అదే సమయంలో సగటు ఉద్యోగిపై ఆదాయపు పన్ను విషయంలో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. కొందరు పన్ను విధానాన్ని ప్రశంసిస్తుంటే.. మరికొందరు విమర్శిస్తున్నారు.

- రాష్ట్ర విభజన హామీలకు సంబంధించి జిల్లాకు ఒకటి చొప్పున సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి నవోదయ స్కూళ్లు, కేంద్రీయ విద్యాలయాలు ఇస్తానని మాట ఇచ్చిన కేంద్రం ఈసారి బడ్జెట్‌లోనూ ఎలాంటి హామీలు, కేటాయింపులు చేయలేదు. దీంతో ఈసారి కూడా తాజా బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు నిరాశే మిగిలింది.
- బడ్జెట్‌లో ఎంపిక చేసిన 50 విమానాశ్రయాల్లో తెలంగాణ నుంచి బసంత్‌నగర్ ఎయిర్‌పోర్టు ఉందా? లేదా అన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. అయితే.. ఈ విషయంలో రాష్ట్రం ఎలాంటి ప్రతిపాదనలు పంపలేదని కేంద్రం మొదటి నుంచి చెబుతూ వస్తోంది.
- దేశవ్యాప్తంగా 174 నర్సింగ్ కాలేజీలను కేంద్రం మంజూరు చేసింది. ఇందులో మూడు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లగా తెలంగాణకు ఒక్క కాలేజీ కూడా మంజూరు కాలేదు. ఇటీవల ప్రతీ జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఇచ్చిన క్రమంలో నర్సింగ్‌కాలేజీలకు అనుమతి ఇచ్చి ఉంటే మరింత ప్రోత్సాహకరంగా ఉండేదని వైద్యనిపుణులు అభిప్రాయపడుతున్నారు.
- సగటు వేతనజీవికి ఆస్తిపన్ను విషయంలో మాత్రం మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. రూ.7 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడంపై కొందరు ప్రజలు స్వాగతిస్తున్నారు. అదే రూ.3 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఉన్న ఆదాయానికి 5% పన్నుపై మరికొందరు పెదవి విరుస్తున్నారు.
- మైనార్టీ బాలబాలికల స్కాలర్‌షిప్పుల రద్దుపై ముస్లిం నాయకులు మండిపడుతున్నారు. ఇది మైనార్టీ వ్యతిరేక ప్రభుత్వమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగులకు ప్రయోజనం లేదు



ఆదాయపు పన్ను మినహాయింపు పరిధిని స్వల్పంగా పెంచి మధ్యతరగతి వేతన జీవులకు భారీ ఊరట ఇచ్చామని ప్రచారం చేసుకోవడం సమంజసం కాదు. ఈ బడ్జెట్ ఏమాత్రం ప్రయోజనకరంగా లేదు. కొత్త పన్ను రాయితీ రూ.5 లక్షల - రూ. 7లక్షలకు పెంచారు. కానీ, కొత్త విధానంలో ఎలాంటి మినహాయింపులు ఉండవు. అధిక ఆదాయ వర్గాలకే కొంత ఉపయోగం.

– అంబటి భూమేశ్వర్, యూటీఎఫ్

గృహ నిర్మాణానికి ప్రోత్సాహం లేదు



ఈబడ్జెట్ ద్వారా ధరలు ఏమాత్రం తగ్గే అవకాశం లేదు. గృహ నిర్మాణానికి ప్రోత్సాహం లేదు. మొత్తంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించిన బడ్జెట్ సగటు వేతన జీవులకు ఏమాత్రం సంతృప్తి కలిగించలేదు. స్లాబ్ రేట్ల సవరణ కూడా స్వల్పంగానే ఉంది.

– శ్యామ్‌సుందర్, యూటీఎఫ్

జిల్లాను మరింత అభివృద్ధి చేస్తా





బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు, ఉద్యోగులు

- ఉమ్మడి జిల్లాలో పనిచేసిన అనుభవం ఉంది
- బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా
- శుభాకాంక్షలు తెలిపిన అధికారులు, ప్రముఖులు

జగిత్యాల: 'ఉమ్మడి జిల్లాలో పనిచేసిన అనుభవం ఉంది.. ఆ అనుభవంతో జిల్లాను మరింత అభివృద్ధి చేస్తా.. ప్రజాసమస్యలు సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటా' అని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. బుధవారం సాయంత్రం ఆమె కలెక్టరేట్‌లో ఉద్యో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వనపర్తి జిల్లాలో మూడేళ్లు కలెక్టర్‌గా విధులు నిర్వర్తించానని, అంతకు ముందు రాజన్న సిరిసిల్ల జిల్లాలో జాయింట్ కలెక్టర్‌గా సుమారు మూడున్నరేళ్లు బాధ్యతలు నిర్వర్తించానని అన్నారు. ధరణి, రెవెన్యూ సంబంధిత సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తానన్నారు. అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ మకరంద్, ఆర్డీవో మాధురి, పలు శాఖల అధికారులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కంటి వెలుగును విజయవంతం చేయాలి

కంటి వెలుగును విజయవంతం చేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అధికారులకు సూచించారు. ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. ముఖ్యంగా జిల్లా, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగుపై కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. జిల్లాలోని నిరుద్యోగులు శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఎస్సీ వెల్ఫేర్ అధికారులకు సూచించారు. రైతు సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ మకరంద్ తదితరులు పాల్గొన్నారు.

2015లో కన్ఫర్మ్‌ ఐఏఎస్‌గా గుర్తింపు..

గ్రూప్‌–1ఆఫీసర్‌గా సంగారెడ్డిలో విధులు నిర్వర్తించిన యాస్మిన్ బాషాకు 2015లో కన్ఫర్మ్‌డ్ ఐఏఎస్‌గా గుర్తింపు లభించింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో జేసీగా, ఆ తర్వాత వనపర్తి కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. కాగా, ఇక్కడి కలెక్టర్ రవిని మహబూబ్‌నగర్ బదిలీ చేయగా, కరీంనగర్ కలెక్టర్ కర్ణన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అనూహ్యంగా షేక్ యాస్మిన్ బాషాను కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

అంబులెన్స్‌లో గంజాయి రవాణా



పట్టుకున్న గంజాయితో ఎస్పీ భాస్కర్, పోలీసులు, నిందితులు

- 70 కిలోలు స్వాధీనం
- నలుగురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: రాజస్తాన్‌కు అంబులెన్సులో తరలిస్తున్న 70 కిలోల గంజాయిని జగిత్యాల జిల్లా సారంగాపూర్ పోలీసులు పట్టుకున్నారు. స్థానిక ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ భాస్కర్ వివరాలు వెల్లడించారు. ఎస్సై మనోహర్‌రావు, హెడ్‌కానిస్టేబుళ్లు వెంకటయ్య, రవీందర్‌రెడ్డి, కానిస్టేబుల్ నరేశ్ బుధవారం సారంగాపూర్ పోలీసుస్టేషన్ ఎదుట వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అటుగా వెళ్తున్న రాజస్తాన్‌కు చెందిన అంబులెన్స్‌ను తనిఖీ చేయగా 70 కిలోల గంజాయి లభ్యమైంది. అదే రాష్ట్రానికి చెందిన రాకేశ్‌కుమార్ బిష్ణోయ్, సునీల్‌కుమార్ వాల్మీకి తెలంగాణకు వచ్చి మహబూబ్‌నగర్ జిల్లా కురవి మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన అందెం గోపి, దొంతగారి సందీప్‌తో పరిచయం పెంచుకున్నారు. వీరందరూ వైజాగ్ ప్రాంతం నుంచి గంజాయి తెప్పించి అంబులెన్స్‌లో రాజస్తాన్‌కు తరలిస్తున్నారు. నిందితులు జల్సాలకు అలవాటు పడి డబ్బు సరిపోక గంజాయి అమ్మకం ద్వారా సొమ్ము సంపాదించాలని నిర్ణయించుకున్నారు. మధ్యవర్తులతో రాజస్తాన్‌కు చెందిన రాకేశ్‌కుమార్, సునీల్‌కుమార్‌తో ఫోన్లో మాట్లాడి ఆన్‌లైన్ ద్వారా డబ్బులు తీసుకుని గంజాయి అప్పగించారు. జగిత్యాల నుంచి నిర్మల్ జాతీయ రహదారి మీదుగా రాజస్తాన్ వెళ్లే క్రమంలో సారంగాపూర్‌లో పట్టుకున్నామని ఎస్పీ వివరించారు. గంజాయిని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన పోలీసు సిబ్బందికి రివార్డులు అందిస్తామని ఎస్పీ తెలిపారు. సమావేశంలో డీఎస్పీ ప్రకాశ్, రూరల్ సీఐ కృష్ణకుమార్, సారంగాపూర్ ఎస్సై మనోహర్‌రావు పాల్గొన్నారు.

జిల్లాను ప్రగతి పథకంలోకి తీసుకెళ్లారు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన పాలన దక్షకుడు కలెక్టర్ రవి అని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రశంసించారు. బదిలీపై వెళ్తున్న కలెక్టర్ రవిని బుధవారం జిల్లా కేంద్రంలో ఆయన శాలువాతో సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జిల్లా రెండోస్థానంలో నిలవడానికి కలెక్టర్ కృషి చేశారని అన్నారు. కరోనా సమయంలోనూ మూడుసార్లు ఆయన వెరవలేదని, జిల్లాప్రజల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ వహించారని అన్నారు. వైద్య, ఇతర రంగాలను అప్రమత్తం చేశారని గుర్తు చేశారు. అంతే కాదు.. జిల్లా ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటూ, వారిసమస్యల పరిష్కారానికి చొరవ చూపారని పేర్కొన్నారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి, హరితహారం, డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకాల అమలులో కలెక్టర్ రవి ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు.

ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్యాయత్నం





ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న విద్యార్థినులు రేవతి, నవనీత

- ఎలుకల మందు తాగిన వైనం
- కథలాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో ఘటన

కథలాపూర్(వేములవాడ): జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం సిరికొండ జెడ్పీ హైస్కూల్‌లోని ఇద్దరు విద్యార్థినులు బుధవారం ఎలుకల నివారణ మందు తిన్నారు. గ్రామస్తులు, ఉపాధ్యాయుల కథనం ప్రకారం.. సిరికొండ గ్రామానికి చెందిన పొన్నం నవనీత(పదో తరగతి), వేల్పుల రేవతి(ఎనిమిదో తరగతి) స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో చదువుకుంటున్నారు. బుధవారం ఉదయం క్లాసులు పూర్తయ్యాక విద్యార్థులతో కలిసి నవనీత, రేవతి బడిలోనే మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం నవనీత, రేవతి ముచ్చటించుకుంటూ మరుగుదొడ్ల వైపు వెళ్లి కాసేపటికి తిరిగి వచ్చారు. వారివద్ద చింపిన ఎలుకల మందు ప్యాకెట్ కనిపించడంతో విద్యార్థులు ఆరా తీశారు. దీంతో తాము ఎలుకల మందు తిన్నట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని మిగతా విద్యార్థులు ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లారు. ఆలోపే విద్యార్థినులు వాంతులు చేసుకుంటూ అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌రావు వారిని బైక్‌లపై కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు జగిత్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. సకాలంలో వైద్యం అందడంతో ప్రాణాపాయం తప్పిందని ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థినులు చదువులో ముందువరుసలో ఉన్నారని ఉపాధ్యాయులు అంటున్నారు. కానీ, బాలికలు ఆత్మహత్య ఎందుకు చేసుకున్నారనే అంశంపై ఇప్పటికీ స్పష్టత రాలేదు.

పాఠశాలలోకి ఎలుకల మందు ఎలా వచ్చింది?

కాగా, జెడ్పీ హైస్కూల్‌లోకి ఎలుకల నివారణ మందు ఎక్కడి నుంచి వచ్చిందనే విషయం చర్చనీయాంశంగా మారింది. ఇద్దరు బాలికలే ముందుగా నిర్ణయించుకుని బయట మందు కొనుగోలు చేసి బడికి తెచ్చుకున్నారా? లేక వేరే ఏదైనా అనుకొని ఎలుకల మందు తిన్నారా? అనే విషయంలో సందేహాలు నెలకొన్నాయి. ఈ విషయమై ఎస్సై రామచంద్రం వివరణ ఇస్తూ.. ఎలుకల నివారణ మందు తిన్న విద్యార్థినులు చికిత్స పొందుతున్నారన్నారు. ప్రధానోపాధ్యాయుడి ద్వారా విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్నామని, వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని హెచ్ఎం చెప్పారని పేర్కొన్నారు.

స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు పొడగింపు

జగిత్యాల: జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనారిటీ విద్యార్థులు 2022–23 విద్యా సంవత్సరానికి స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకునే గడువును మార్చి 31వ తేదీ వరకు పొడగించారు. ఈ విషయాన్ని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ పాస్ వెబ్‌సైట్ ద్వారా స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంకా అందని రాతపుస్తకాలు

- విద్యార్థినులకు తప్పని తిప్పలు

పెగడపల్లి(ధర్మపురి): కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లోని విద్యార్థినులకు ఇప్పటికీ నోట్ బుక్కులు అందలేదు. హోంవర్క్, క్లాస్‌వర్క్ చేసుకునేందుకు తిప్పలు పడుతున్నారు. కొందరు ప్రైవేటుగా కొనుగోలు చేస్తూ ఆర్థికంగా సతమతం అవుతున్నారు. మరికొందరు పాత నోటు బుక్కులతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

బాలికల్లో అసహనం..

- ఎఫ్‌ఏ–1,2 ఎస్‌ఏ–1 పరీక్షలు పూర్తయినా నేటికీ నోటుబుక్స్ ఇవ్వక పోవడంతో విద్యార్థినులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.
- అయితే టెండర్‌దారుకు ప్రభుత్వం నోటుబుక్కులకు చెల్లించే ధర, బహిరంగ మార్కెట్లో ఉన్న ధరలో వ్యత్యాసం బాగా ఉంటోందని అంటున్నారు.
- ధరల్లో తేడా ఉండటంతోనే తమకు గిట్టుబాటు కావడంలేదనే కారణంతో నోటుబుక్కులు సరఫరా చేసేందుకు టెండర్‌దారులు ముందుకు రావడంలేదని తెలుస్తోంది.

14 కేజీబీవీలు.. 3 వేల మంది విద్యార్థినులు

జిల్లాలో 14 కేజీబీవీలు ఉండగా సుమారు 3 వేల మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. ఒక్కో విద్యార్థినికి తరగతి స్థాయిని బట్టి 7 - 10 వరకు నోట్‌బుక్స్ అవసరం అవుతాయి. ఈ లెక్కన జిల్లాలోని విద్యార్థినులకు దాదాపు 25వేల వరకు నోట్ బుక్కులు సరఫరా చేయాల్సి ఉంది. పాఠ్యపుస్తకాలు, యూనిఫారమ్స్, ప్లేట్లు, గ్లాసులు, రగ్గులతోపాటు నోట్‌బుక్స్‌నూ ప్రభుత్వమే ఉచితంగా అందించాల్సి ఉంది. అదికూడా పాఠశాలల ప్రారంభానికి ముందే విద్యార్థులకు చేరాల్సి ఉంది. విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు ఏడు నెలలు గడుస్తున్నా రాత పుస్తకాలు అందక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాదు.. ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలు వినడంతోనే సరిపెట్టుకుంటున్నారు. జిల్లాలోని కస్తూరి బా గాంధీ బాలికల విద్యాలయాల్లో చదువుకునే బాలికలు పేదకుటుంబాలకు చెందినవారే కావడంతో ప్రభుత్వం ఇచ్చే నోట్‌బుక్కులే ఆధారం.



పెగడపల్లి కేజీబీవీలో చదువుతున్న విద్యార్థినులు

పెరిగిన కాగితం ధరలు..

కాగితం ధర, రవాణా చార్జీలు పెరగడం, రెండేళ్ల క్రితం ఉన్న ధరలే ప్రభుత్వం ప్రస్తుతం చెల్లిస్తుండటంతో ఈసారి నోట్‌బుక్కుల సరఫరా గిట్టుబాటు కావడం లేదని టెండర్‌దారులు అంటున్నారు. అందుకోసమే ఈసారి వాటిని అందించేందుకు ముందుకు రావడంలేదని అధికారులు చెబుతున్నారు. నాలుగు నెలల క్రితం టెండర్ పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదని, మారోసారి టెండర్ పిలిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని వారు పేర్కొంటున్నారు. విద్యాసంవత్సరం ముగిసే లోపైనా నోట్‌బుక్కులు అందుతాయా? లేదా అని బాలికలు ఆందోళన చెందుతున్నారు.

ధరల్లో వ్యత్యాసమే కారణమా?

- విద్యార్థులకు అందించే 200 పేజీల లాంగ్‌సైజ్ నోటుబుక్కు ధర బహిరంగ మార్కెట్లో రూ. 40పైనే ఉంది. కాంట్రాక్టర్లకు ప్రభుత్వం రూ.31.30 చెల్లిస్తోంది.
- 100 పేజీల షార్ట్‌నోట్ బుక్కుకు ప్రభుత్వం రూ.10.29 చెల్లిస్తుండగా బహిరంగ మార్కెట్‌లో రూ.12పైనే విక్రయిస్తున్నారు.
- 200 పేజీల షార్ట్ నోట్‌బుక్కుకు రూ. 17.77 చెల్లిస్తుండగా బయట రూ.24 వరకు ధర పలుకుతోంది.

నోటు బుక్కులులేవు



మాకు ఇక్కడ నాణ్యమైన చదువు చెబుతున్నరు. ఈసారి నోటుబుక్కులు ఇంకా రాలేదు. అవిలేక టీచర్లు చెబుతున్న పాఠాల్లోని ముఖ్యాంశాలను రాయలేకపోతున్నం .

– వైశాలి, తొమ్మిదో తరగతి, పెగడపల్లి

ఇంకా రాలేదు..



ఏటా ప్రభుత్వం మాకు ఉచితంగా నోటుబుక్కులు అందించేది. ఈసారి ఇప్పటివరకు రాలేదు. పాత నోటుబుక్కుల్లోనే రాసుకుంటున్న. అవి సరిపోవడం లేదు. వెంటనే రాత పుస్తకాలు అందించాలి.

– చర్మిష్మ ఏడో, తరగతి, పెగడపల్లి

జాబితా పంపించాం



కేజీబీవీల్లో విద్యార్థినులకు అవసరమయ్యే నోట్ బుక్కుల గురించి ప్రభుత్వానికి జాబితా పంపించాం. ఏటా ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేస్తోంది. ఈ ఏడాది ఇంకా సరఫరా కాలేదు. అవి రాగానే అందరికీ అందిస్తాం.

– జగన్‌మోహన్‌రెడ్డి, విద్యాధికారి

క్లుప్తంగా

ఎల్‌వోసీ చెక్కు అందజేత



ఎల్‌వోసీ అందిస్తున్న మంత్రి కొప్పుల

గొల్లపల్లి(ధర్మపురి): వెన్నుమట్ల గ్రామానికి చెందిన గంగయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో సర్పంచ్ గుడ్ల లక్ష్మి ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. చికిత్స నిమిత్తం రూ.2.50 లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన ఎల్‌వోసీని మంత్రి కొప్పుల ఈశ్వర్ బుధవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఆయన కుటుంబ సభ్యులు మంత్రి కొప్పుల ఈశ్వర్, సర్పంచ్ లక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు.

మడలేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



పూజల్లో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్(జగిత్యాల): రామాజీపేట గ్రామంలో మడలేశ్వరస్వామి– సీతాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ బుధవారం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు వీరిని ఘనంగా సన్మానించారు. ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, సర్పంచ్ బెజ్జంకి రమాదేవి, ఉపసర్పంచ్ హరీశ్‌రావు, ఆలయ కమిటీ నిర్వాహకులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

నియామకం



సురేశ్ చౌహాన్

సారంగాపూర్(జగిత్యాల): లంబాడీల ఐక్యవేదిక సాంస్కృతి విభాగం రాష్ట్ర ఇన్‌చార్జిగా ధర్మనాయక్‌తండా గ్రామానికి చెందిన లావుడ్యియా సురేశ్ చౌహాన్ నియమితులయ్యారు. ఉస్మానియా యునివర్శిటీలో చదువుతున్న సమయంలో తెలంగాణ ఉద్యమంలో సురేశ్ చౌహాన్ చురుకుగా పాల్గొన్నారు. దీనిని గుర్తించిన లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ జాదవ్, చీఫ్ కోర్డినేటర్ రమేశ్.. సురేశ్ చౌహాన్‌కు రాష్ట్ర ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని పురాణిపేటకు చెందిన ఇనుగుర్తి భూమయ్య(70) కాంతి భవన్ సమీపంలో ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతుండగా ట్రాక్టర్ ఢీకొని మృతిచెందాడు. పురాణిపేటకు చెందిన ఇనుగుర్తి భూమయ్య పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. కాంతిభవన్ సమీపంలో రోడ్డు దాటుతుండగా ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ భూమయ్య ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు శ్రీధర్ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ కిశోర్ తెలిపారు.

గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసే వేదిక



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రి గంగుల



మేయర్ సునీల్‌రావు బ్యాటింగ్, మంత్రి కీపింగ్



తలపడుతున్న జట్లు

- విద్యార్థులు, యువత క్రీడా రంగంలో రాణించాలి
- సాక్షి ప్రీమియర్ లీగ్ సీజన్ 4ను ప్రారంభించిన మంత్రి గంగుల

కరీంనగర్‌స్పోర్ట్స్: గ్రామీణ ప్రాంతాల్లోని మెరికల్లాంటి క్రీడాకారులను వెలికి తీసేందుకు 'సాక్షి' ప్రీమియర్ లీగ్ ఒక వేదికలాంటిదని, 'సాక్షి' మీడియా చేస్తున్న ప్రయత్నం అద్వితీయమని రాష్ట్ర బీసీ సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ తిమ్మాపూర్‌లోని జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో, స్టేట్ స్పాన్సర్ సుధాకర్ పీవీసీ పైప్స్ సౌజన్యంతో నిర్వహించిన సాక్షి ప్రీమియర్ లీగ్ సీజన్ 4 పోటీలను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతోనే యువత, చిన్నారులు సన్మార్గాల్లో నడుస్తారన్నారు. యువత విద్యలోనే కాకుండా అన్నిరంగాల్లోనూ రాణించాలన్నారు. మేయర్ సునీల్ రావు, జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ సాగర్‌రావు మాట్లాడుతూ ఇలాంటి పోటీలు గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు సువర్ణావకాశమని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి, మేయర్ బ్యాటింగ్ చేసి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. అంతకుముందు ఉదయం జరిగిన పోటీలను జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు ప్రారంభించారు. కార్యక్రమంలో సుధాకర్ పైప్స్ ఏరియా మేనేజర్ షేక్ రఫీ, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, కార్పొరేటర్ ఎడ్ల అశోక్, కరీంనగర్ సాక్షి యూనిట్ బ్రాంచి మేనేజర్ వైద శ్రీనివాస్, బ్యూరో ఇన్‌చార్జి అనిల్, ఏడీవీటీ మేనేజర్ లక్ష్మీనారాయణ, సర్క్యులేషన్ మేనేజర్ మధుకర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తొలి రోజు ఫలితాలు

జూనియర్స్ విభాగంలో జ్యోతిష్మతి డిప్లొమా కళాశాల, కరీంనగర్ జట్టు.. అల్ఫోర్స్ జూనియర్ కళాశాల, మంచిర్యాలపై గెలిచింది. ఎస్సారార్ జూనియర్ కళాశాల, మంచిర్యాల జట్టు.. కాకతీయ జూనియర్ కళాశాల, గోదావరిఖని జట్టుపై



వికెట్ తీసిన ఆనందంలో..

విజయం సాధించింది. సీనియర్స్ విభాగంలో వివేకానంద డిగ్రీ కళాశాల, కరీంనగర్ జట్టు వివేకానంద ఇంజనీరింగ్ కళాశాల, కరీంనగర్‌పై విజయం సాధించింది. జూనియర్స్ బ్యాటింగ్‌లో రిషి (అల్ఫోర్స్) 23 పరుగులు, ఫిరోజ్ (జ్యోతిష్మతి) 20 పరుగులు, హుద్రేయార్ (ఎస్సారార్) 19 పరుగులు చేసి అలరించారు. సీనియర్స్‌లో ఆదిల్ (వివేకానంద) 34 పరుగులు చేశారు. కాగా జూనియర్స్ విభాగంలో జ్యోతిష్మతి (కరీంనగర్), ఎస్సారార్ (మంచిర్యాల) జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి.

తమ్ముడిని హత్య చేశారనే..

- మంథని సుమన్ హత్యలో కీలక పాత్రధారి ధనాల చంద్రశేఖర్
- 15 రోజుల ముందు నుంచే ప్రణాళిక
- జైలులో పరిచయమైన నేరస్తుడితో కలిసి ఘాతుకం
- ఏడుగురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్



నిందితుల అరెస్ట్ చూపుతున్న డీసీపీ వైభవ్ గైక్వాడ్

గోదావరిఖని(రామగుండం): తన తమ్ముడు ధనాల శివకుమార్ అలియాస్ చిన్న హత్యకు ప్రతీకారంగానే మంథని సుమన్‌ను ధనాల చంద్రశేఖర్ హతమార్చాడు. బుధవారం గోదావరిఖని వన్‌టౌన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ వివరాలు వెల్లడించారు. ఘటనకు 15రోజుల ముందునుంచే స్కెచ్ చేసి పక్కా ప్రణాళిక ప్రకారం ప్రధాన నిందితుడు ధనాల చంద్రశేఖర్, వరంగల్ జైలులో అతడికి పరిచయమైన వేముల నవీన్ అలియాస్ బాబి కలిసి సుమన్‌ను హత్య చేసినట్లు పేర్కొన్నారు. దీనికి చంద్రశేఖర్ బంధువులు సహకరించారు. గోదావరిఖని లెనిన్‌నగర్‌లో నివాసముంటున్న చంద్రశేఖర్ ప్రస్తుతం విజయవాడలో ఉంటున్నాడు. ఇతడిపై గతంలో రౌడీషీట్‌తో పాటు పలు కేసులు ఉన్న క్రమంలో పీడీయాక్ట్ నమోదు చేసి 2019లో వరంగల్ జైలుకు పంపారు. తన తమ్ముడ్ని 2018లో హత్య చేసిన సుమన్‌ను ఏలాగైనా చంపాలనే నిర్ణయించుకున్నాడు. వరంగల్ జైలులో ఉన్న సమయంలో వేముల నవీన్ అలియాస్ బాబితో పరిచయమైంది. ఈక్రమంలో మంథని సుమన్ హత్యకు సహకరిస్తే హైదరాబాద్‌లో రెస్టారెంట్ పెట్టుకునేందుకు ఆర్థికసాయం చేస్తానని చెప్పడంతో బాబి ఒప్పుకున్నాడు.

అదనుచూసి ప్రధాన చౌరస్తాలోనే..

మంథని సుమన్‌ను హత్య చేసేందుకు హైదరాబాద్‌లో ఉంటున్న బాబి గత నెల 28న గోదావరిఖనికి బస్సులో వచ్చాడు. తర్వాత చంద్రశేఖర్, బాబి ఇద్దరూ ఆనంద్ ఇంట్లో బస చేశారు. గత నెల 29న రాత్రి 8.20 గంటల సమయంలో చంద్రశేఖర్, బాబి ప్రధాన చౌరస్తా వద్దకు వచ్చారు. అప్పుడే సుమన్ చాయ్ తాగి తన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు చేరుకుంటున్న క్రమంలో చంద్రశేఖర్, బాబి కత్తులతో విచక్షణరహితంగా దాడి చేసి చంపేశారు. అనంతరం బాబి రైలులో హైదరాబాద్ పారిపోయాడు.

ఏడుగురి అరెస్ట్

మంథని సుమన్ హత్య కేసులో ఏడుగురిని అరెస్ట్ చేశారు. గోదావరిఖని లెనిన్‌నగర్‌కు చెందిన ధనాల చంద్రశేఖర్, హైదరాబాద్ బేగంపేట్ ప్రకాశ్‌నగర్‌కు చెందిన వేముల నవీన్ అలియాస్ బాబి, ప్రధాన నిందితుడి బావ యైటింక్లయిన్ కాలనీకి చెందిన మాడుగుల శ్రీనివాస్, చెల్లె మాడుగుల స్వరూప, బంధువులు గోదావరిఖని హనుమాన్‌నగర్‌కు చెందిన గంరేటి అజయ్‌కుమార్, గంరేటి శేషి, రామగుండం హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన బంగారి ఆనంద్‌ను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి మూడు కత్తులు, ఆటో, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచారు. ఈకేసులో చాకచక్యంగా



స్వాధీనం చేసుకున్న కత్తులు

వ్యవహరించి నిందితులను పట్టుకున్న గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్, సీఐలు రమేష్‌బాబు, ప్రసాద్‌రావు, ఇతర అధికారులు, సిబ్బందిని డీసీపీ అభినందించారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

ఇటీవల హత్యకు గురైన సుమన్, హత్య చేసిన చంద్రశేఖర్ ఇద్దరు రౌడీషీటర్లు కావడంతో.. ఇక ముందు రౌడీషీటర్లపై పోలీసుల వైఖరి ఏలా ఉండబోతోందని అడిగిన ప్రశ్నకు డీసీపీ స్పందించారు. ఈవిషయంలో సీపీ సీరియస్‌గా ఉన్నారని, త్వరలో జిల్లా వ్యాప్తంగా ఉన్న రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే పల్లెల అభివృద్ధి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

కొడిమ్యాల(చొప్పదండి): బీఆర్‌ఎస్ హయాంలోనే తెలంగాణ పల్లెలు అభివృద్ధి చెందాయని చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ అన్నారు. నాచుపల్లిలో రూ.80 లక్షలు, హిమ్మత్రావుపేటలో రూ.26 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు, దమ్మయపేట, కోనాపూర్ గ్రామపంచాయతీ భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం తిరుమలాపూర్‌లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోతారం, మైసమ్మ రిజర్వాయర్ల ఎల్‌ఎంసీ కాలువ నిర్మాణాలకు మార్చిలోపు టెండర్లను పూర్తిచేయించి, పనులు ప్రారంభిస్తామన్నారు. ఎంపీ బండి సంజయ్ అభివృద్ధి పనుల కోసం ఒక్కరూపాయి కూడా తేలేదని, జీవన్‌రెడ్డి ఆర్ అండ్ బీ మంత్రిగా ఉన్న కాలంలోనూ నాచుపల్లి బ్రిడ్జి నిర్మాణ పనులను చేపట్టలేదని విమర్శించారు. దళితబంధు పథకంపై బీఎస్పీ అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేనేని స్వర్ణలత, జెడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, కొడిమ్యాల సింగిల్‌విండో చైర్మన్ మేనేని రాజనర్సింగరావు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయానికి ఎస్సై అటాచ్

జగిత్యాలక్రైం: పెగడపల్లి ఎస్సై శ్వేత, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డిని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఎస్పీ భాస్కర్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ఎస్సై శ్వేత మూడు రోజుల క్రితం పెగడపల్లి మండలానికి చెందిన ఓ సర్పంచ్‌ని అకారణంగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారని, ఓ హెడ్‌కానిస్టేబుల్ ఆయనపై చేయి చేసుకున్నారని అదే మండల పర్యటనలో ఉన్న మంత్రి కొప్పుల ఈశ్వర్ దృష్టికి వెళ్లింది. మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో మల్యాల సీఐ రంగంలోకి దిగారు. సర్పంచ్‌ని ఠాణా నుంచి తీసుకెళ్లి మంత్రికి అప్పగించారు. జరిగిన విషయం గురించి బాధితుడు మంత్రికి చెప్పారు. దీంతో ఎస్సై, హెడ్‌కానిస్టేబుల్‌ను పోలీస్‌స్టేషన్ నుంచి తొలగించాలని ఎస్పీకి మంత్రి సూచించారు. ఈమేరకు ఎస్సై, హెడ్‌కానిస్టేబుల్‌ను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీచేశారు.

ఎస్సైపై గతంలోనూ ఫిర్యాదు

పెగడపల్లి మండలం నంచర్ల గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు ఒకరు అక్కడి ఎస్సైపై ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తన సోదరుడి కారు ఎస్సై బంధువులు తీసుకెళ్లారని, కరీంనగర్‌లోని బీజేపీ నాయకుడి సోదరుడు.. ఆ కారు ఎవరు తెచ్చారని అడిగాడని, దీంతో మరుసటిరోజు ఆ నాయకుడిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఎస్సై దుర్భాషలాడారని బాధితుడు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

'ఇబ్బందులకు గురిచేయడం తగదు'



మాట్లాడుతున్న విజయ్‌అజాద్

మెట్‌పల్లి(కోరుట్ల): పంచాయతీల పెండింగ్ బిల్లులను చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం సర్పంచులను ఇబ్బందులకు గురిచేయడం తగదని కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర కన్వీనర్ కొమిరెడ్డి విజయ్ అజాద్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బిల్లుల చెల్లింపుల్లో ప్రభుత్వం జాప్యం చేస్తుండడంతోనే సర్పంచులకు ఆర్థిక ఇబ్బందులు ఎదురై మనస్తాపంతో ఆత్మహత్యలకు పాల్పడడం బాధాకరమన్నారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిన కేసీఆర్ కుటుంబం తమ సంపదను పెంచుకుంటోందని విమర్శించారు. విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయని, ప్రభుత్వం స్పందించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కోరుట్ల కాంగ్రెస్ టిక్కెట్ తమ కుటుంబానికే వస్తుందని, నియోజకవర్గంలో ఆ పార్టీ టిక్కెట్ తెచ్చుకునే సత్తా ఇతరులెవరికీ లేదన్నారు. నాయకులు ఎర్రొల హన్మాండ్లు, రైసుద్దీన్, సురభి అశోక్, బాశెట్టి హరీశ్, కోటగిరి సిద్ధార్థ, విమల్, పల్లికొండ ప్రవీణ్, పెంట ప్రణయ్, పొట్ట గోపి, కంతి హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోరుట్లలో 'తుపాకులగూడెం' చిత్ర బృందం



స్వాగతం పలుకుతున్న కళాకారులు

కోరుట్ల: 'రెబల్స్ ఆఫ్ తుపాకుల గూడెం' చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని నటుడు వడ్లకొండ రవి, బహుజన గళం లింగంపెల్లి నరేశ్ కోరారు. నూతనంగా చిత్రీకరించిన రెబల్స్ ఆఫ్ తుపాకుల గూడెం సినిమా బృందం బుధవారం కోరుట్లలో పర్యటించింది. కళాకారులు వారికి ఘనస్వాగతం పలికారు. తెలంగాణకు చెందిన 40 మంది కళాకారులు ఈ సినిమాలో నటించారు. ఏటూరునాగారం ప్రాంతంలో షూటింగ్ చేశారు. ఈనెల 3న ప్రపంచ వ్యాప్తంగా 200 సెంటర్లలో ఈ సినిమా రిలీజ్ అవుతుందని చిత్ర బృందం పేర్కొంది. సినిమాలో నటించిన శివరాంరెడ్డి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వ్యక్తి. ,హీరో శ్రీకాంత్ రాథోడ్, హీరోయిన్ జైత్ర మఖానా నటిస్తున్నారు. శుక్రవారం కోరుట్ల థియేటర్లలోనూ సినిమా రిలీజ్ అవుతుందని పేర్కొన్నారు. కళాకారులు చెన్నా విశ్వనాథం, బింగి వెంకటేస్, సుతారి రాములు, బింగి రాకేశ్, ఎండీ జనీల్, అందె శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీటీలకు బహుళ పదోన్నతులు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న కిరణ్, మచ్చ శంకర్

జగిత్యాల: ఎస్జీటీలకు బహుళ పదోన్నతులు కల్పించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బైరం హరికిరణ్, మచ్చ శంకర్ బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. రెండు సబ్జెక్ట్‌ల్లో బీఈడీ పూర్తిచేసిన ఎస్జీటీ.. స్కూల్ అసిస్టెంట్ రెండు సబ్జెక్ట్‌ల్లో పదోన్నతి పొందేందుకు అర్హుడని పేర్కొన్నారు. అలాగే ఎల్‌ఎఫ్ ఎల్ హెచ్‌ఎం ప్రమోషన్‌కు కూడా అర్హుడని వివరించారు. ప్రభుత్వం కేవలం ఒక ప్రమోషన్‌కు మాత్రమే ఆప్షన్ ఇచ్చేలా అండర్‌టేకింగ్ ఇవ్వాలని ఆదేశించడం న్యాయం కాదని పేర్కొన్నారు. మూడు పదోన్నతుల్లో ఆప్షన్ అవకాశం ఇస్తూ మ్యానువల్‌గా పదోన్నతుల ప్రక్రియ పూర్తిచేయాలని వారు కోరారు.

గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి నిధులివ్వండి

జగిత్యాలరూరల్: గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ఎమిగ్రేట్స్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడు మంద భీంరెడ్డి కోరారు. 'గల్ఫ్ దేశాల్లో భారతీయ కార్మికుల రక్షణ' అంశంపై ఢిల్లీలో రెండ్రోజుల సదస్సు నిర్వహించారు. బుధవారం బ్రిటన్‌కు చెందిన ఫెయిర్ స్క్వేర్, ఢిల్లీలోని సీఈసీ సంస్థల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గల్ఫ్‌లోని ఇండియన్ ఎంబసీలు, కాన్సులేట్‌లలో ఇండియన్ కమ్యూనిటీ వెల్ఫేర్ ఫండ్ అనే అత్యవసర నిధి ఉందని, కష్టాల్లో ఉన్న కార్మికులను ఆదుకోవడానికి ఈనిధిని భారత రాయబారులు ఉపయోగిస్తుంటారన్నారు. ప్రస్తుతం నిధుల కొరత ఎదురైందని, పేద వలస కూలీలకు సాయం అందడం లేదని తెలిపారు. ఈ సమస్యల నుంచి గట్టెక్కేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఎంబసీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ఇతర సమస్యలన్నింటినీ పరిష్కరించాలని విన్నవించారు. ఈకార్యక్రమంలో ఫెయిర్ స్క్వేర్ సంస్థ ప్రతినిధులు ఉస్మాన్ జావేద్, నికోలస్ మెగియన్, తెలంగాణకు చెందిన సిస్టర్ లిసీ, సుహృద తదితరులు పాల్గొన్నారు.

అమ్మక్కపేట సబ్‌స్టేషన్‌కు పవర్ ట్రాన్స్‌ఫార్మర్



సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేస్తున్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్

కోరుట్ల: ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేట సబ్‌స్టేషన్‌కు రూ.50లక్షలతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేశారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు తెలిపారు. అమ్మక్కపేటలో సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయినా.. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకపోవడంతో పలు సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొంటూ పలువురు ప్రజాప్రతినిధులు విద్యాసాగర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన.. ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావుకు ఫోన్ ద్వారా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు గురించి వివరించారు. ఆయన స్పందించి రూ.50లక్షలతో ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేశారు. ఆ వెంటనే సబ్‌స్టేషన్‌కు పంపించారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను త్వరలోనే బిగించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరుకు కృషి చేసిన రాష్ట్రప్రభుత్వం, టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావుకు విద్యాసాగర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

సమగ్ర వ్యవసాయ పద్ధతుల పరిశీలన

జగిత్యాలఅగ్రికల్చర్: లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఎడ్మల మల్లారెడ్డి సమగ్ర వ్యవసాయ పద్ధతులను వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు బుధవారం పరిశీలించారు. పొలాస వ్యవసాయ పరిశోధనస్థానం ఆధ్వర్యంలో కార్నెల్ సద్గురు ఫౌండేషన్ ఫర్ డెవలప్‌మెంట్ సభ్యులు మల్లారెడ్డి తోటను సందర్శించారు. మల్లారెడ్డి సాగుచేస్తున్న పండ్లతోటలు, కోళ్లు, తేనెటీగలు, సీమకోళ్లు, బాతులు, గొర్రెల పెంపకం గురించి తెలుసుకున్నారు. పరిశోధన స్థానం శాస్త్రవేత్త రజినిదేవి, సద్గురు అగ్రికల్చర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉపేంద్ర పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎన్జీవోలు

జగిత్యాల: కలెక్టర్ యాస్మిన్ బాషాకు టీఎన్జీవో నాయకులు స్వాగతం పలికారు. కలెక్టర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించిన ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు శశిధర్, కార్యదర్శి నాగేందర్‌రెడ్డి, కోశాధికారి సాహెద్‌బాబు, రవీందర్, రాజేందర్ పాల్గొన్నారు.

శిథిల భవనాలు కూల్చివేత

కథలాపూర్(వేములవాడ): పోతారం, కలిగోట గ్రామపంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో వాటిని కూల్చివేయించినట్లు డీఎల్పీవో శంకర్ పేర్కొన్నారు. బుధవారం రెండు గ్రామాల్లో పర్యటించి గ్రామపంచాయతీ భవనాలు పరిశీలించారు. ఇక్కడ భవన నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.20 లక్షల చొప్పున మంజూరు చేసిందన్నారు. పాతవి కూల్చివేసి కొత్తవి నిర్మించాలని నిర్ణయించామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జనార్దన్, ఎంపీవో గంగాధర్, ఏఈ ఆదిత్య, సర్పంచ్ ధర్మపురి జలందర్, ఉపసర్పంచ్ లత, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలంలోని గోదావరి నదీ తీరం నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం కొల్వాయి గ్రామశివారులో పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. తుంగూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని, డ్రైవర్ పల్లపు రమేశ్‌పై కేసు నమోదు చేశామన్నారు. ట్రాక్టర్‌ను జప్తు చేసి పోలీస్‌స్టేషన్ తరలించినట్లు ఎస్సై వివరించారు.